సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 17 । జూన్ । 2025



రొయ్యకు సిండి'కాటు'
వనామీ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. 8లో



ఏజెన్సీలో విజృంభిస్తున్న జ్వరాలు
ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ టైఫాయిడ్, మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. 8లో



వంతెనకు రంధ్రం.. అవస్థలతో జనం
నారాయణపురం వద్ద జాతీయరహదారికి అనుసంధానంగా ఉన్న వంతెనకు భారీ రంధ్రం పడటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

డీపీఓగా రామ్‌నాథ్‌రెడ్డి



కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీఓ రామ్‌నాథ్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా ఎస్.రామ్‌నాథ్‌రెడ్డి, భీమవరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.రాంబాబు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ నాగరాణిని కలిసి పూల మొక్కలు అందించారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచేందుకు, ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధుల ఆస్తులకు రక్షణ కల్పించాలి



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా

భీమవరం: తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని, ట్రిబ్యునల్ తీర్పును కచ్చితంగా అమలు జరిగేలా చూడాలని జిల్లా వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డాల సత్యనారాయణ, కొటికలపూడి చిట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవం సందర్భంగా భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, వృద్ధుల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని, మండలానికి కనీసం ఒక వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసి నిర్వహించాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ నాగరాణికి అందజేశారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, మట్లపూడి సత్యనారాయణ, నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో సోషల్ మీడియా చిచ్చు



ఆచంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

పెనుగొండ: సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెట్టిన పోస్టులు ఆచంట నియోజకవర్గంలో చిచ్చురేపాయి. జనసేన పార్టీపై ఆక్రోశం వెళ్లగక్కుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై పోస్టులు పెట్టి అవహేళన చేస్తుండటంతో జనసేన కార్యకర్తలు రగిపోతున్నారు. అనుచిత పోస్టులపై పోడూరు, ఆచంట, పెనుమంత్ర, పెనుగొండ పోలీస్‌స్టేషన్లలో సోమవారం ఫిర్యాదు చేశారు. అలాగే పెనుగొండ సర్పంచ్ భర్త నక్కా వేదవ్యాస శాస్త్రి, అతడి సోదరుడు శర్మలపై ఆరోపణలు చేస్తూ పోస్టింగ్ పెట్టడం వివాదంగా మారింది. దీనిపై మాల మహానాడు నాయకులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ వరకూ ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ గ్రూపు అడ్మిన్‌ను ఆచంట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలంటూ జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆ గ్రూపులో సదరు వ్యక్తి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, హైకోర్టు అడ్వకేట్ ఇందుగపల్లి రామానుజం, జనసేన నాయకుడు కంబాల బాబులుపైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె తప్పదని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పట్టణ నాయకులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం వారు నిరసన తెలిపారు. నాయకులు నూకపల్లి శేఖర్, యర్రంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ చాలాకాలంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వేతనాలు పెంచాలని, బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. హెడ్‌వాటర్ వర్క్స్, అవుట్ డోర్ వాటర్ సప్లయ్, ఆ ఫీస్ ఎలక్ట్రీషియన్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్, ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం.. రైతు దైన్యం

- 24 గంటల్లోనే ధాన్యం సొమ్ములంటూ కూటమి ప్రగల్భాలు
- నెలరోజులైనా అందక రైతుల ఎదురుచూపులు
- జిల్లాలో దాదాపు 18 వేల మంది రైతులకు రూ.290 కోట్ల మేర బకాయిలు
- సొమ్ములు చెల్లించాలని కూటమి నేతలే సోషల్ మీడియాలో పోస్టులు
- ఖరీఫ్ పెట్టుబడులకు సొమ్ముల్లేక రైతుల ఇక్కట్లు

సాక్షి, భీమవరం : జిల్లాలోని 2.2 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు చేయగా 9.25 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఓపెన్ మార్కెట్‌లో విక్రయాలు, నిల్వ నిమిత్తం 1.50 లక్షల టన్నులు మినహాయించగా, 7.75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు సిఫార్సు చేసింది. కాగా ఆరు లక్షల టన్నుల సేకరణకు మాత్రమే తొలుత కూటమి ప్రభుత్వం సివిల్ సప్లయిస్ అధికారులకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ తీరుపై రైతుల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో తర్వాత మరో 1.5 లక్షల టన్నులు సేకరించేందుకు అనుమతినిచ్చింది.

రూ.290 కోట్ల బకాయిలు


ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం చెబుతుండగా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. రబీ సీజన్‌లో జిల్లాలో దాదాపు 77 వేల మంది రైతుల నుంచి రూ.1,650 కోట్లు విలువైన 7.17 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో రూ.1,360 కోట్లు రైతుల ఖాతాలకు జమచేసింది. 18 వేల మందికి పైగా రైతులకు సంబంధించి రూ.290 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. దాదాపు నెల రోజులుగా ప్రభుత్వం ధాన్యం సొమ్ముల చెల్లింపులను నిలిపివేసినట్టు తెలుస్తోంది. సాగు చివరిలో ప్రతికూల వాతావరణం ఇబ్బంది పెట్టినా వ్యయప్రయాసల కోర్చి ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయిస్తే సొమ్ములివ్వకుండా ఇబ్బంది పెడుతోందని రైతులు వాపోతున్నారు. గత నెలలో జిల్లాలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణశాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌లు మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమచేస్తున్నట్టు తెలపగా అప్పటికే రూ.కోట్లల్లో ధాన్యం బకాయిలు ఉన్నట్టు సమాచారం. రైతులకు చెల్లించాల్సిన సొమ్ములను ప్రభుత్వం వేరే అవసరాల నిమిత్తం దారి మళ్లించడమే బకాయిలు పేరుకుపోవడానికి కారణంగా తెలుస్తోంది.

ఖరీఫ్ సాగుపై ప్రభావం

కాలువలకు నీరు విడుదల కావడం, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు మొదలవ్వడంతో జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల్లో తొలకరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పెట్టుబడుల నిమిత్తం ధాన్యం సొమ్ముల కోసం ఎదురు చూస్తున్నారు. సకాలంలో ప్రభుత్వం నుంచి డబ్బులు పడకపోతే బయట అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. ధాన్యం బకాయిల విడుదలకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించామని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.



ధాన్యం మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)



Narayana Tcn

అయ్యా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మా యువ నాయకులు నారా లోకేష్ గారికి మా చిన్న విన్నపం. 31 వ తేదీనే ఇంటింటికి తిరిగి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వటం, తల్లికి వందనం పేరుతో డబ్బులు పంచటం బాగానే ఉంది sir, కానీ 6 నెలలు రైతు కష్టపడి పండించిన పంట మన ప్రభుత్వం కొని నెల రోజులు గడిచినా రైతుకి డబ్బు ఇవ్వలేదు.
ఎక్కడో లోపం ఉంది. ఒక రైతు దగ్గర ధాన్యం మే నెల 02న ప్రభుత్వం కొన్నది. ఈ నెల 13 అయిపోయింది. ఇంత వరకు డబ్బు ఎకౌంట్లో పడలేదండి , మన ప్రభుత్వం ధాన్యం ఎగుమతి చేసిన 24 గంటల్లో అమౌంట్ పడిపోతుందని చెప్పారండి అది జరగడం లేదు నేను మన తెలుగుదేశం పార్టీ అభిమానిగా కోరుతున్నాను లోపం ఎక్కడ ఉందో చూసి సరిచేయాలి కోరుకుంటున్నాను.

అయ్యా.. ఏపీ సీఎం నారా చంద్రబాబు **నాయుడు, నారా లోకేష్‌కి** విన్నపం.. ఆరు **నెలలు రైతు కష్టపడి పండిం**చిన పంట మన ప్రభుత్వం కొని నెల రోజులు గడిచినా రైతులకు డబ్బులు ఇవ్వలేదు. ఎక్కడో లోపం ఉంది. ఒక రైతు దగ్గర ధాన్యం మే 2న ప్రభుత్వం కొన్నది. ఇప్పటివరకూ డబ్బులు ఖాతాల్లో పడలేదు. మన ప్రభుత్వం ధాన్యం ఎగుమతి చేసిన 24 గంటల్లో అమౌంట్ పడిపోతుందని చెప్పింది.. అది జరగడం లేదు.

సోషల్ మీడియాలో తణుకు ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ నేత పెట్టినట్టుగా భావిస్తున్న ఈ పోస్టు జిల్లాలో రైతులకు ధాన్యం నగదు చెల్లింపులో జరుగుతున్న తీవ్ర జాప్యానికి అద్దం పడుతోంది.

వెంటనే డబ్బులు చెల్లించాలి



ధాన్యం తోలి నెల రోజులు కావస్తున్నా డబ్బులు బ్యాంకుకు జమ కాలేదు. నాలుగు ఎకరాలు వరి సాగు చేస్తున్నాను. నాతో పాటు ఇతర రైతులకు కలిపి సుమారు రూ.3 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలి. లేకుంటే చాలా ఇబ్బందులు పడతాం.

– కర్రి వెంకటేశ్వర రెడ్డి, రాయకుదురు

అప్పులు చేయాల్సిన దుస్థితి



నాలుగు ఎకరాలు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. ధాన్యం మే నెల 11న మిల్లుకు వెళ్లింది. సుమారు 150 బస్తాలకు రూ.2.50 లక్షలు రావాలి. ఇప్పటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇప్పుడు సార్వా నారుమడులు వేయాలంటే అప్పు చేయాల్సిన దుస్థితి. రెండు రోజుల్లో ధాన్యం డబ్బులు వేస్తామని చెప్పి ఇలా మోసం చేయడం తగదు.

– రుద్రరాజు శివరామరాజు, నారినమెరక

● మీకో దండం.. తల్లికి వందనం ఇప్పించండి



కూటమి ప్రభుత్వం ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం అమలుచేయగా.. అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవంటూ విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటూ గ్రామ, వార్డు సచివాలయాలకు వస్తున్నారు. గత ప్రభుత్వంలో తమకు అమ్మఒడి లబ్ధి చేకూరిందని, ఇప్పుడు మాత్రం తల్లికి వందనం అందలేదంటూ సుమారు 20 శాతం మంది గగ్గోలు పెడుతున్నారు. పలు నిబంధనల పేరుతో తమను పథకానికి దూరం చేశారంటూ సచివాలయాల సిబ్బంది వద్ద మొరపెట్టుకుంటున్నారు. ఏం చెప్పాలో తెలియక సచివాలయ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వివరాలను గ్రీవెన్స్‌లో నమోదు చేస్తామని చెప్పి పంపిస్తున్నారు. యలమంచిలి మండలం మేడపాడు సచివాలయం వద్ద సోమవారం కనిపించిన దృశ్యమిది. - యలమంచిలి

ఫిర్యాదులపై సత్వర చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదులపై సమగ్రమైన విచారణ జరిపి సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. పలు ప్రాంతాల నుంచి 15 ఫిర్యాదులు అందగా సంబంధిత స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



పెద అమిరంలో జగన్ అంటే నమ్మకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి, మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ కవురు, నాయకులు

కాళ్ల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే నమ్మకం.. టీడీపీ అధినేత చంద్రబాబు అంటే మోసం, ద్రోహం అని ప్రజలకు కూటమి ఏడాది పాలనలో తెలిసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పెద అమిరంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు కలిసి సోమవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం ప్రజాకోర్టు చార్జ్‌షీట్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలన, కూటమి ఏడాది పాలనపై ప్రజలకు అవగాహన కల్పించేలా పుస్తకాన్ని రూపొందించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రజలు జగన్, చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుంటున్నారన్నారు. 2024 ఎన్నికల్లో సూపర్‌సిక్స్ హామీలిచ్చి ఐదు కోట్ల ప్రజల్ని వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే హామీలను అమలుచేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కూటమి పాలనలో మోసపోయినట్టు ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎల్లవేళలా ప్రజల పక్షాన ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలుచేసే వరకూ ఒత్తిడి తెస్తామని ముదునూరి తెలిపారు.

30 లక్షల మంది తల్లులకు ద్రోహం

నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులకు అన్నదాత సుఖీభవ సాయం, మహిళలకు ఆడబిడ్డ నిధి (నెలకు రూ.1,500), నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పేరుతో 30 లక్షల మంది పిల్లలకు ద్రోహం చేశారన్నారు. అందరికీ తల్లికి వందనం ఇచ్చినప్పుడు సంబరాలు చేసుకుంటే ప్రజలు కూడా హర్షిస్తారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు.

జగన్ పాలనను గుర్తుచేసుకుంటూ..

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ రాష్ట్రంలో మూడు పోర్టులు తీసుకువస్తే కూటమి ప్రభుత్వం పక్కన పడేసిందన్నారు. అలాగే 17 మెడికల్ కాలేజీలను పూర్తి చేయగా వాటినీ పక్కన పెట్టేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాట మీద నిలబడ్డ జగన్‌ను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జులు చినమిల్లి వెంకట్రాయుడు (భీమవరం), గుడాల గోపి (పాలకొల్లు), రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్ర జయసరిత, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి, పెండ్ర వీరన్న, చిగురుపాటి సందీప్, కోడె యుగంధర్, గాదిరాజు రామరాజు, పేరిచర్ల విజయరామరాజు, మంతెన సునీల్‌వర్మ, పెనుమత్స ఆంజనేయరాజు, చేకూరి నరేంద్ర వర్మ, అంబటి రమేష్, కొండేటి శివ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కొల్లేరు దస్త్రాలతో సిద్ధం కండి



కొల్లేరు మ్యాప్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు

కైకలూరు: కొల్లేరులో క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) మంగళ, బుధవారాల్లో పర్యటించనున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అన్ని దస్త్రాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. రూట్‌మ్యాప్ పరిశీలన నిమిత్తం నిడమర్రు మండలం తోకలపల్లి, మండవల్లి మండలం మణుగునూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజుతో కలిసి సోమవారం ఆమె పర్యటించారు. కొల్లేరులో నివాసిత ప్రాంతాలు, జిరాయితీ, డీఫాం భూములు, 2006 సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే విషయాలను కమిటీ పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కొల్లేరులో వాస్తవ పరిస్థితులను పరిశీలించి మూడు నెలల్లో నివేదిక సుప్రీంకోర్టుకు అందిస్తారన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ కొల్లేరు పరిరక్షణ, ప్రజల ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి బి.విజయ, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, రాష్ట్ర చేపల రైతు సంఘ అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) తదితరులు ఉన్నారు.

సీఈసీ పర్యటన ఇలా..

ఏలూరు(మెట్రో): కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఏలూరు చేరుకుంటుంది. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4 గంటల మధ్య కలకుర్రు, మణుగునూరు, ఆటపాక, కొల్లేటికోటను సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు కొల్లేటికోటలో రైతులు, కొల్లేరువాసులతో సమావేశమవుతారు. 5 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఏలూరు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లో దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు మండలాల రైతులు, కొల్లేరువాసులు, అధికారులతో సమావేశమవుతారు. 18న ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల మధ్య నిడమర్రులో జిరాయితీ భూములను, కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యం ప్రాంతాలను పరిశీలిస్తారు.

ఉంగుటూరులో కలెక్టర్ పర్యటన

ఉంగుటూరు: నియోజకవర్గంలోని కొల్లేరు పరీవాహక ప్రాంతాలను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. తోకలపల్లి, వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.

డీఎస్సీ పరీక్షలకు 93 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో సోమవారం ఐదు కేంద్రాల్లో నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 93 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. ఉదయం 605 మందికి 561 మంది, మధ్యాహ్నం 597 మందికి 559 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

ఏలూరు జిల్లాలో.. 984 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 984 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 181 మందికి 179 మంది, మధ్యాహ్నం 180 మందికి 164 మంది హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 145 మందికి 136 మంది, మధ్యాహ్నం 141 మందికి 132 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 201 మందికి 190 మంది, మధ్యాహ్నం 200 మందికి 183 మంది హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

20, 21వ తేదీల్లో పరీక్షల మార్పు

ఈనెల 20, 21వ తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలు మార్పు చేశారని, 20న పరీక్షను జూలై 1న, 21న జరగాల్సిన పరీక్షను జూలై 2 న నిర్వహించనున్నారని డీఈఓ తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు ఈనెల 25 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

యోగా జీవితంలో భాగం కావాలి



కేపీపాలెం బీచ్‌లో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్పీ

నరసాపురం: యోగా దైనందిన జీవితంలో భాగం కావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం కేపీపాలెం బీచ్‌లో యోగాసనాలు వేశారు. జిల్లాలో గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో 4,635 ప్రాంతాల్లో యోగా అభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జిల్లా ఎస్పీ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ డి.శ్రీవేద, యోగా టీచర్ టి.శిరీష తదదితరులు పాల్గొన్నారు.

19న విష్ణు కళాశాలలో..

భీమవరం: యోగాంధ్రలో భాగంగా ఈనెల 19న భీమవరం విష్ణు కాలేజీ ఆవరణలో సుమారు 5 వేల మంది అథ్లెట్లు, క్రీడాకారులు, యువతతో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

క్లుప్తంగా

ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనలో ట్రిపుల్‌ఐటీ అధికారులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కొరకు ఆర్జీయూకేటీ దరఖాస్తులను స్వీకరించింది. దీంతో 1340 దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎన్‌సీసీ, సైనికోద్యోగుల పిల్లలు, క్రీడా, దివ్యాంగులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. క్రీడా విభాగంలో 62 మంది, ఎన్‌సీసీ విభాగంలో 85 మంది, సైనికోద్యోగుల పిల్లల విభాగంలో 12 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగానికి సంబంధించి 15 మంది కలిపి మొత్తం 174 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

స్కీముల పేరిట మోసగిస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డి.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం అర్బన్ : ఇచ్చిన సొమ్ముకు రెట్టింపు సొమ్ము ఇస్తామంటూ స్కీముల పేరిట అమాయక ప్రజలను మోసగిస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్టు తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా టేకుల నాయక తండాకు చెందిన సదాసూత సాయికిరణ్, మోహనరావు స్నేహితులు. భీమడోలుకు చెందిన ఆర్‌కే రెడ్డి అనే ఆనంద్‌కు సింహాద్రి మోహనరావు స్నేహితుడు. వీరిద్దరికీ సన్నిహితం ఉండటం కారణంగా కొడూరు మండలం చిన్నూరుకు చెందిన నక్కా సత్తిబాబు పరిచయమయ్యాడు. ఈ పరిచయంలో భాగంగా సత్తిబాబు తమ వద్ద ఒక స్కీమ్ ఉందని, సొమ్ములు ఇచ్చిన వారికి రెట్టింపు సొమ్ములు ఇస్తామని మోహనరావుతో చెప్పాడు. దీంతో ఆశపడిన సాయికిరణ్, మోహనరావు కొంత సొమ్మును ఈ నెల 13న తాడేపల్లిగూడెం బస్టాండ్ సెంటర్ వద్దకు తీసుకొచ్చారు. వీరు డబ్బు తెచ్చిన విషయం గమనించిన సత్తిబాబు, అతని స్నేహితుడు ఏలూరు ఆనంద్‌లు వీరిని పిలిచి.. తమ కారులోకి ఎక్కించుకున్నారు. ఈలోగా తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ సుభాని, జంగారెడ్డిగూడేనికి చెందిన పిల్లిబోయిన గణేష్ వీరి కారులోకి చొరబడి కత్తిని చూపించి బెదిరించి నగదు బ్యాగ్‌ను లాక్కున్నారు. అనంతరం కారు నుంచి దించేసి వారంతా పరారయ్యారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ డి.విశ్వనాథ్ పర్యవేక్షణలో సీఐ బోణం ఆదిప్రసాద్, ఎస్సైలు బాదం శ్రీనివాస్, పి.నాగరాజు సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి నక్కా సత్తిబాబు, ఆనంద్, పిల్లిబోయిన గణేష్, షేక్ సుభానిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,20,000 నగదును, రెండు అరల సూట్‌కేస్, బ్యాగులు, బ్లేడు కత్తి స్వాధీనం చేసుకున్నారు.

రొయ్యకు సిండి‘కాటు’

- వనామీ ధరలు పతనం
- 100 కౌంట్ ధర రూ.240 నుంచి రూ.200కు తగ్గింపు
- 2 టన్నులలోపు అయితే రూ.180
- ఆందోళనలో ఆక్వా రైతులు
- సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారని ఆవేదన
- అప్సడాతో సిండికేట్ ఆగడాలకు చెక్ పెట్టిన జగన్ ప్రభుత్వం



రొయ్య రైతు కష్టాలు తీరేదెప్పుడో?

సాక్షి, భీమవరం: వారం వ్యవధిలో వనామీ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ.240 ఉన్న 100 కౌంట్ ధర రూ.200 నుంచి రూ.180కి తగ్గించేయడం ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం సిండికేటుకు కొమ్ముకాస్తోందని విమర్శిస్తున్నారు.

అమెరికా పన్నుల పేరిట దోపిడీ

వేసవి ఉష్ణోగ్రతలు అనుకూలించి మార్కెట్‌లోకి రొయ్యలు రావడం పెరగడంతో ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, వ్యాపారులు ఏకమై ధరలు తగ్గిస్తూ వచ్చారు. ఏప్రిల్ 3న అమెరికా ప్రతీకార సుంకాల ప్రకటన వెలువడే నాటికి 30 కౌంట్ ధర రూ.460, 40 కౌంట్ ధర రూ.370, 100 కౌంట్ ధర రూ.230కి తగ్గించేశారు. అమెరికా పన్నులను సాకుగా చూపించి కౌంట్‌కు కేజీకి రూ.30 నుంచి రూ.70 వరకు కోత పెట్టారు. ఇప్పట్లో పన్నులు లేవని తర్వాత అమెరికా ప్రకటించినా సిండికేట్ వర్గాలు ధరలను పెంచకపోవడం గమనార్హం.

కంటితుడుపు చర్యలతో సరి

ఫీడ్ ప్లాంట్ల యజమానులు మేత ధరలు పెంచేసినా.. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు ఏకమై తమ కష్టాన్ని దోచుకుంటున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏప్రిల్‌లో రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పంట విరామం సైతం ప్రకటించారు. ఈ పరిణామాలతో ఉలిక్కిపడిన ప్రభుత్వం ఉండిలో ఆక్వా సదస్సు, విజయవాడలో ప్రాన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాల్లో మేత ధరలను కేవలం టన్నుకు రూ.4 వేలు మాత్రమే తగ్గించడం, 100 కౌంట్ ధరను స్వల్పంగా పెంచడం తదితర కంటితుడుపు చర్యలతో సరిపెట్టింది.

మళ్లీ ధరలు పతనం

వారం క్రితం 100 కౌంట్ ధర దాదాపుగా రూ.240 ఉండగా, 30 కౌంట్ ధర రూ.385, 40 కౌంట్ ధర రూ.325, 50 కౌంట్ ధర రూ.295, 60 కౌంట్ ధర రూ.265 వరకు ఉన్నాయి. రానున్న సీజన్‌కు గాను మరలా చెరువులను సిద్ధం చేసుకునేందుకు రైతులు పట్టుబడులు ముమ్మరం చేయడంతో మార్కెట్‌లోకి రొయ్యలు రావడం ముమ్మరమైంది. ఇదే అదునుగా తిరిగి సిండికేట్లు ధరలను తగ్గించేస్తున్నాయి. పెద్ద రైతులైతే ఎక్కువ టన్నుల్లో పట్టుబడులు జరిగి 100 కౌంట్‌కు రూ.210 వరకు ధర చెల్లిస్తుంటే.. చిన్న రైతులు మూడు టన్నుల లోపు పట్టుబడులు చేయడం వల్ల పట్టుబడి పరిమాణాన్ని బట్టి 100 కౌంట్ రొయ్యలను కేజీ రూ.200 నుంచి రూ.180కు కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. మిగిలిన కౌంట్ల ధరలు సైతం తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతికూల వాతావరణం, నాణ్యత లేని సీడ్, ఫీడ్‌తో ఇబ్బందులు పడుతుంటే ధరల పతనం తమను మరింత నష్టాల్లోకి నెట్టేస్తోందని వాపోతున్నారు.

నాడు అప్సడాతో అండ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)ని ఏర్పాటు చేసి హేచరీలు, ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఆగడాలకు చెక్ పెట్టింది. ధరలను పూటకో రకంగా మారుస్తూ రైతుల కష్టాన్ని దోచుకునే పరిస్థితికి చెక్ పెట్టడంతో పాటు 10 రోజులకోసారి సమావేశమై ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లను విశ్లేషిస్తూ రైతుకు లాభసాటి ధర అందేలా పనిచేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ దిశగా చర్యలు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

ఆక్వా రంగం కుదేలు

ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఆక్వా రంగం సిండికేటు దోపిడీతో సంక్షోభంలో కూరుకుపోతోంది. సీడ్, ఫీడ్, లీజు, మెడిసిన్ ధరలు 100 శాతం పెరగ్గా.. రొయ్యల ధర మాత్రం పతనమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు చేయడం చాలా కష్టం. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపోతున్నాం.

– పొత్తూరి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, కలగంపూడి

గత ప్రభుత్వంలో ఇలా లేదు



ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు సిండికేట్ అయి ఇష్టానుసారం ధరలు తగ్గించేస్తున్నారు. టన్నులను బట్టి 100 కౌంట్‌ను కేజీ రూ.210 నుంచి రూ.180కి కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. ధరలు స్థిరంగా ఉండేవి. ఇప్పుడు ఏ రోజు ఎలా మారతాయో తెలియడం లేదు. ఆక్వా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– పెనుమాల నరసింహస్వామి, ఆక్వా రైతు, గొల్లవానితిప్ప

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



న్యాయమూర్తులకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) న్యాయమూర్తులు సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తులు డాక్టర్ లతా బస్వరాజ్ పాట్నే, షాలిని మిశ్రా (రిటైర్డ్ ఐఏఎస్), రిజిస్ట్రార్ జి.నవీన్ కుమార్, సీఏటీ సిబ్బందికి ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి స్వామివారి శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు చిన వెంకన్న చిత్ర పటాలను, ప్రసాదాలను వారికి అందజేశారు.

పోక్సో కేసులో యావజ్జీవ శిక్ష

వీరవాసరం: బాలికను మోసపూరిత మాటలతో మభ్యపెట్టి, బెదిరించి, గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి జీవిత కాల కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానాలో రూ.80 వేలు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొణితివాడకు చెందిన కండెల్లి రమేష్ స్థానిక బాలిక (16)ను మోసపూరిత మాటలతో మభ్యపెట్టి, బెదిరించి గర్భవతిని చేశాడంటూ ఆమె తండ్రి 2020 జూలై 13న పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై నేరం రుజువవడంతో జడ్జి తీర్పు చెప్పారు.

వంతెనకు రంధ్రం.. అవస్థల్లో జనం



వంతెనపై ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు



పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్, హెచ్చరిక బోర్డు

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం వద్ద జాతీయరహదారికి అనుసంధానంగా ఉన్న వంతెనకు భారీ రంధ్రం పడటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భీమవరం నుంచి గణపవరం మీదుగా నారాయణపురం వద్ద జాతీయరహదారికి చేరుకునేందుకు కీలకంగా ఉన్న ఈ వంతెనకు ఆదివారం రంధ్రం పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ద్విచక్ర వాహనాలు మినహా మరే ఇతర వాహనాలూ వెళ్లకుండా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వంతెనపై పెద్ద వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా మట్టిని, రాళ్ల గుట్టలను అడ్డుగా వేశారు. ద్విచక్ర వాహనదారులు వాటి మధ్యే ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కార్లు తదితర వాహనాలు నారాయణపురం శివారులో ఉన్న మట్టి రోడ్డు ద్వారా ఉంగుటూరుకు, మరికొన్ని తల్లాపురం రోడ్డు మీదుగా చేబ్రోలు వంతెనకు చేరుతున్నాయి. మరికొందరు వాహనదారులు చేబ్రోలు పోలీస్‌స్టేషన్ నుంచి కాలువ గట్టు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గాలు అంత అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారుల రాక

వంతెనకు ఆదివారం రంధ్రం పడగా, ఆర్‌అండ్‌బీ అధికారులు రెండోరోజైన సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు రావడం గమనార్హం. ఆర్‌అండ్‌బీ ఈఈ కిషోర్ బాలాజీ, డీఈ గోవింద మోహన్, ఏఈ ప్రభాకరరావు వంతెన వద్ద రంధ్రం పడిన ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక అధికారులు పలు సూచనలు చేశారు. నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు తెలుస్తోంది.



తల్లాపురం-నారాయణపురం రోడ్డులో వెళుతున్న వాహనాలు

బ్రిటీష్ కాలం నాటి వంతెనలు

బ్రిటీష్ వారి కాలంలో కట్టిన ఈ వంతెనలకు కాలం చెల్లింది. 1935లో నిర్మించిన ఈ వంతెనలు దశాబ్ద కాలం నుంచి పట్టు కోల్పోయి బలహీనపడ్డాయి. వేలాది వాహనాలు వీటిపై రాకపోకలు సాగిస్తుండటంతో వీటి సామర్థ్యం తగ్గిపోయిందని, ఆయా వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరేళ్ల క్రితం ఉంగుటూరు బ్రిడ్జి కూడా ఇలాగే ధ్వంసం కాగా, దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించకుండా రూ.35 లక్షలు వెచ్చించి మరమ్మతులతో సరిపెట్టారు. ఇక నారాయణపురంలో కొత్త వంతెన నిర్మాణంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

ఏజెన్సీలో విజృంభిస్తున్న జ్వరాలు

- రోజురోజుకూ పెరుగుతున్న మలేరియా, టైఫాయిడ్ కేసులు
- నామమాత్రంగానే ఉన్న మలేరియా మందులు
- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రులు



మలేరియా జ్వరంతో బుట్టాయగూడెం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న గుళ్లమడుగు గ్రామస్తులు



వైద్యం పొందుతున్న నందిని



వీరమద్దిగూడేనికి చెందిన ఉమాదేవి



వైద్యం పొందుతున్న బుల్లిరెడ్డి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, వర్షాలు కూడా కురుస్తూండడంతో మన్యంలో రోజురోజుకూ టైఫాయిడ్, మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే మలేరియా బారిన పడిన జ్వర పీడితులు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. అధికారికంగా జనవరి నుంచి ఇప్పటివరకూ 148 మలేరియా కేసులు నమోదైనప్పటికీ అనధికారికంగా ఆ కేసులు రెట్టింపు ఉండొచ్చని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రులు కూడా జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి.

అధికంగా మలేరియా కేసులు

ఇటీవలి వర్షాలతో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలతో పాటు జిల్లాలోని ఏలూరు, ద్వారకాతిరుమల, లక్కవరం తదితర గ్రామాల్లో కూడా మలేరియా కేసులు నమోదైనట్టు చెప్తున్నారు. జనవరి నుంచి జూన్ మొదటివారం వరకు బుట్టాయగూడెం మండల పరిధిలోని కేఆర్‌పురం పీహెచ్‌సీలో 12 కేసులు, పీఆర్‌గూడెం పీహెచ్‌సీ పరిధిలో 23, నందాపురం పరిధిలో 6, దొరమామిడి పరిధిలో 16, అంతర్వేదిగూడెం పరిధిలో 8, వేలేరుపాడు మండలం కొయిదా పీహెచ్‌సీ పరిధిలో 28, వేలేరుపాడు 4, పోలవరం మండలం కోండ్రుకోట పీహెచ్‌సీ పరిధిలో 6, ద్వారకాతిరుమల 1, లక్కవరం 1, ఏలూరు 1, కొయ్యలగూడెం 1, రాచన్నగూడెం 6, కామయ్యపాలెం 3తో పాటు పలు గ్రామాల్లో మొత్తం 148 కేసులు జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైనట్లు మలేరియా అధికారులు తెలిపారు.

వెంటాడుతున్న మందుల కొరత

జిల్లాలో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో ప్రతి గ్రామంలోనూ టైఫాయిడ్, మలేరియా కేసులతో బాధపడుతున్నవారు ఉన్నారు. మలేరియా నివారణకు సంబంధించిన క్లోరోక్విన్ మాత్రలు ఆస్పత్రుల్లో అందుబాటులో లేవని సమాచారం. గతంలో ఈ మందులనే మలేరియా నివారణకు అధికంగా ఇచ్చేవారు. ఈ మందుల సరఫరా లేకపోవడం వల్ల కిందిస్థాయి సిబ్బందిని బయట కొనుగోలు చేసి ఇవ్వాలని చెప్పినట్టు సమాచారం. గతంతో పోల్చుకుంటే ఇటీవల కాలంలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న క్రమంలో వీటి నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మలేరియా నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 148 కేసులు నమోదయ్యాయి. వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఏసీటీ మందులు అందుబాటులో ఉన్నాయి. క్లోరోక్విన్ మాత్రలకు ప్రతిపాదనలు పంపించాం. మలేరియా కేసులు నమోదైన ప్రదేశాల్లో స్ప్రేయింగ్ పనులు చేయించడంతో పాటు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం.

– ఎస్ఎస్ఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

భార్యను కర్రతో కొట్టి చంపిన భర్త

ఏలూరు టౌన్: ఎనిమిది పదుల వయస్సు దాటిన వృద్ధుడు వీల్‌చైర్‌లో ఉంటూనే.. నిద్రపోతున్న వృద్ధురాలైన తన భార్యను కర్రతో కొట్టి చంపాడు. కేవలం తన మాట వినటం లేదనే కోపంతో వృద్ధుడు హత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలం రాజుపాలెంకు చెందిన బొబ్బా లక్ష్మణరావు, రంగమ్మ దంపతులు. లక్ష్మణరావుకు 85 సంవత్సరాలు కాగా, భార్య రంగమ్మకు 75 సంవత్సరాలు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కావటంతో ఏలూరులోని శ్రీరామ్‌నగర్‌లో కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండడంతో వారిద్దరినీ కుమార్తెలు తాము ఉంటున్న ప్రాంతంలోనే ఇంటిని అద్దెకు తీసుకుని ఉంచారు. లక్ష్మణరావుకు అనారోగ్యం కారణంగా కొంతకాలం క్రితమే ఒక కాలును శస్త్ర చికిత్స చేసి మోకాలు పైవరకు తొలగించారు. ఆయన వీల్‌చైర్‌లోనే ఉంటుండగా.. కుమార్తెలు ఆయనకు కేర్ టేకర్‌ను ఏర్పాటు చేశారు. లక్ష్మణరావు కొద్దిరోజులుగా సొంత ఊరు వెళ్ళిపోదామని భార్య రంగమ్మకు చెబుతున్నాడు. అందుకు ఆమె నిరాకరిస్తూ.. కుమార్తెల వద్దే ఉందామని చెబుతూ వస్తోంది. ఈ కారణంగా వృద్ధ దంపతుల మధ్య కొద్దిరోజులుగా గొడవ జరుగుతోంది. భార్య రంగమ్మపై కోపంతో ఉన్న లక్ష్మణరావు సోమవారం మంచంపై నిద్రపోతున్న రంగమ్మను కర్రతో బలంగా కొట్టడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై రాత్రి వరకూ ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రోన్లతో ఏజెన్సీని జల్లెడ పడుతున్నాం

ఎస్పీ కేపీఎస్ కిషోర్ వెల్లడి

జంగారెడ్డిగూడెం: ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, జిల్లా ఏజెన్సీ ప్రాంతాన్ని డ్రోన్లతో జల్లెడ పడుతున్నామని ఎస్పీ కేపీఎస్ కిషోర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల జాడ కోసం కూంబింగ్‌లు జరిగాయని, ఈ నేపథ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో కొంతమంది మరణించారని చెప్పారు. కూంబింగ్, ఎన్‌కౌంటర్‌ల నేపథ్యంలో మావోయిస్టులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. ఈ నేపథ్యంలో వారు షెల్టర్ కోసం జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. గతంలో వారు ఈ ప్రాంతాన్ని షెల్టర్ జోన్‌గా వినియోగించుకున్న సంఘటనలు ఉన్నాయని, ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ముందుగానే జిల్లాలో నక్సల్ వింగ్‌కు సంబంధించి ఒక విధానం రూపొందించనున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే తరచుగా పోలీస్‌స్టేషన్‌ల తనిఖీలు, పోలవరం ప్రాజెక్టు భద్రత పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు. ఏఎస్ఎస్ పార్టీలు జిల్లా ఏజెన్సీలో కూంబింగ్ చేస్తున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరిస్తున్నారని, సంఘ విద్రోహులకు సహాయం చేసే అవకాశాలు లేవని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెంలో పోలీసింగ్ మరింత పటిష్టం చేసే దిశగా పట్టణం మొత్తం సీసీ కెమెరా వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేపీఎస్ కిషోర్ తెలిపారు. పోలీసింగ్‌ను ప్రజలకు మరింత నమ్మకంగా మార్చే ఉద్దేశంతో దాత నవభారత్ యాజమాన్యం సహకారంతో డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్‌లు పట్టణంలో సీసీ టీవీ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు కలిగి ఉండటం, జంగారెడ్డిగూడెం పట్టణం అభివృద్ధి చెందడంతో నేరాలు జరిగే అవకాశం ఉందని, సీసీ కెమెరాల వ్యవస్థ ఉండటం వల్ల వీటిని అరికట్టే వీలుంటుందని తెలిపారు. ఒకవేళ ఘటనలు చోటుచేసుకున్నా త్వరగా వాటిని ఛేదించవచ్చని చెప్పారు. ఇటీవల కాలంలో జాబ్ ఇస్తానని మోసం చేశారంటూ కేసులు నమోదవుతున్నాయని, ఇలాంటి వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల ద్వారకాతిరుమలలో ఇలాంటి ఘటన చోటుచేసుకుందని, నిందితుడిని అరెస్ట్ చేశామని చెప్పారు. ఏలూరుతో పాటు జంగారెడ్డిగూడెంలో కూడా పోలీస్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఎస్పీ వెల్లడించారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: బాకీ తీర్చే నిమిత్తం ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి గాను మచిలీపట్నానికి చెందిన మేకల శ్రీకాంత్ కుమార్‌కు రూ.9 లక్షల జరిమానా, ఏడాది జైలుశిక్ష విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. చెల్లని చెక్కు ఇచ్చారంటూ చాట్రాయి మండలం చిత్తపూర్‌కు చెందిన గంగుల నాగమారేశ్వరరావు ఆయనపై ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

మెగా డీఎస్సీ పరీక్షకు 293 మంది హాజరు



వాసవీలో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: సోమవారం పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మెగా డీఎస్సీ పరీక్షకు 293మంది హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం కలిపి 309మంది హాజరు కావాల్సిఉండగా, 293మంది వచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు పర్యవేక్షించారు.

ముగిసిన వాలీబాల్ ఉచిత శిక్షణ



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాండురంగరాజు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో రెండు నెలల పాటు నిర్వహించిన వాలీబాల్ రెసిడెన్సియల్ ఉచిత శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 50 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో క్రీడాకారులకు క్రీడాకోటలో ఉచితంగా విద్యనందిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ జి మోజెస్, కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ కె రామకృష్ణంరాజు,, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్ రామకృష్ణంరాజు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బీవీ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మోషేనురాజుకు అభినందనలు



మోషేనురాజును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భీమవరం: శాసనమండలి సభ్యునిగా పదవీ బాధ్యతలు స్వీకరించి సోమవారం నాటికి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కొయ్యే మోషేనురాజుకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. పట్టణంలోని మోషేనురాజు క్యాంపు కార్యాలయంలో పార్టీ భీమవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు నేతృత్వంలో పార్టీ నాయకులు కేక్ కట్‌చేశారు. మోషేనురాజుకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్, కోడే యుగంధర్, బలే ఏసుబాబు, బోకూరి విజయరాజు, బి ధర్మా, బుంగా ప్రహ్లాదుడు, కందుల కాశీ, గాజుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువగల ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెగ్యులర్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

భీమవరం: బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు శక్తి యాప్‌ను ఆపత్కాలంలో వినియోగించుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు సూచించారు. సోమవారం భీమవరంలోని తిరుమల విద్యా సంస్థల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శక్తి మొబైల్ యాప్ వినియోగం, జిల్లాలో శక్తి టీమ్స్ పనితీరు, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించిన పలు అంశాలపై విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు తమపై జరిగే ఏ నేరమైనా ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు పాల్గొన్నారు.

కొందరికే వందనం

- తల్లికి వందనానికి కొర్రీలు
- విద్యుత్ బిల్లుల గండంగా తల్లికి వందనం
- సచివాలయాల్లో అనర్హత లిస్టుల్లో అధిక శాతం 300 యూనిట్లు దాటిన విద్యుత్ బిల్లులే
- సచివాలయాలకు క్యూకడుతున్న ప్రజలు
- నిరాశగా వెనుదిరుగుతున్న వైనం



అత్తిలిలో సచివాలయం

తణుకు అర్బన్ : తల్లికి వందనం సంక్షేమ పథకానికి విద్యుత్ బిల్లుల్లో 300యూనిట్లు వాడకం గండంగా మారింది. సచివాలయంలో ఉన్న అనర్హత లిస్టులో ఉన్న ప్రకారం అధిక సంఖ్యలో విద్యుత్ బిల్లుల కారణంగానే తల్లికి వందనం పథకానికి అర్హులు కాలేని వారి సంఖ్య కనిపిస్తోంది. దీంతో ప్రజానీకం తల లుపట్టుకుని గొల్లుమంటున్నారు. వేసవి సందర్భంగా గడిచిన మూడునెలల్లో తమ నివాసాల్లో విద్యుత్ వాడకం పెరిగిందని అదనంగా ఫ్యాన్లు ఏర్పాటు చేసుకున్నామని, ఉక్కపోతకు ఆగలేక అప్పుచేసి ఏసీ ఏర్పాటు చేసుకున్నామని దీంతో విద్యుత్ బిల్లులు పెరిగిపోయి తల్లికి వందనం అందలేదని గొల్లుమంటున్నారు. అయినప్పటికీ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా పథకాలు ఇవ్వాలేకానీ ఇదెక్కడి నిబంధనలంటూ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తల్లికి వందనం గండాలివే..

తల్లికివందనం పథకానికి అర్హులుకాలేని వారి తాలూకా లిస్టును సచివాలయాల్లో ఉంచారు. లబ్ధి అందని ప్రజానీకం ఆయా సచివాలయాలకు వచ్చి లిస్టులో తమ పేరు పక్కన ఎందుకురాలేదో తెలుసు కుని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికంగా విద్యుత్ వాడకం కాగా, వెయ్యి చదరపుగజాల స్థలం దాటి ఉండడం, ఆదాయపు పన్ను చెల్లింపు, కుటుంబసభ్యుల్లో ఒకరికి నాలుగు చక్రాల వాహనం ఉండడం, ఆదాయానికి తగిన ధ్రువపత్రంలేదని ఇలా పలు కారణాలతో అధికసంఖ్యలో తల్లికి వందనం అందుకోలేని వారి సంఖ్య ఉంది. దీంతో ప్రజానీకం హామీలు ఇవ్వడమెందుకు ఇవ్వకుండా కఠిన నిబంధనలు పెట్టడమెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆంక్షలు ఉండవన్నారు



తల్లికి వందనానికి ఎటువంటి ఆంక్షలులేకుండా అమలు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు చెప్పారు. కానీ నేడు రూ. 2వేలు స్కూల్స్ కట్‌చేసి రూ. 13వేలు ఇస్తున్నారు. వివిధ కారణాలు చూపించి చాలా మంది తల్లులకు తల్లికి వందనం ఇవ్వడంలేదు. ముఖ్యంగా విద్యుత్ బిల్లులో 300 యూనిట్‌లను చూపించి అనర్హులుగా మార్చేస్తున్నారు. చాలా మంది అర్హులు మాకు అందలేదంటూ బాధపడుతున్నారు.

– జల్లూరి జగదీష్, తణుకు

బీవీఆర్ కళాకారుల సేవలు అభినందనీయం



కళాకారులకు సత్కారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళాకారుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ సాంస్కృతిక సమాహారం జరిగింది. సభా కార్యక్రమానికి బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. గౌరవ పురస్కారం టెక్నికల్ ఏఈఈ రెడ్డి సుబ్రహ్మణ్యం, కళా పురస్కారం భజన కళాకారుడు అంబటి వెంకట తాతారావు, ఆర్థిక సత్కారం రూ 44 వేలు పేద కళాకారుడు ఆలపాడుకు చెందిన బి.త్రినాథ్‌రాజు అందజేశారు. సిరి మామిళ్ళ పెద్దిరాజు, ఎన్వీ రమణారావు, పీటీ వెంకన్న, కె.వేంకట నరసింహాచార్యులు, పురప్రముఖులు, సాహితీ అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు. పలువురికి సత్కారాలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సంక్షేమం నిల్.. అవాస్తవాలు ఫుల్

- తణుకు పార్టీ కార్యాలయంలో పుస్తకావిష్కరణ
- ఏడాది పాలన అంతా దాడులు, కేసులు, రక్తపుటేరులు
- మాజీ మంత్రి కారుమూరి



తణుకులో కూటమి ఏడాది పాలనపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి, పార్టీ నాయకులు

తణుకు అర్బన్: కూటమి ఏడాది పాలన మోసం, దాడులు, మర్డర్లు, మానభంగాలు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. జగన్ ఐదేళ్ల పాలన నమ్మకానికి ప్రతీకగా నిలిస్తే, కూటమి ఏడాది పాలనలో చంద్రబాబు అంటే మోసం అనే విధంగా సాగిందని స్పష్టం చేశారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం కూటమి ఏడాది పాలన నిర్వాకంపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలన చంద్రబాబు సృష్టించిన నరమేధాన్ని, రక్తపుటేరులు సాగించిన వైనాన్ని పుస్తకంలో కళ్లకు కట్టినట్లుగా చూపించారని అన్నారు. నిర్దాక్షిణ్యంగా రోడ్డుపైనే బహిరంగంగా అమాయకులను నరకడాలు, మహిళలను టీడీపీ నాయకులు ఇళ్లలోంచి లాక్కొచ్చి మరీ కొట్టడం హృదయ విదారకంగా ఉన్నాయని అన్నారు. ఇటీవల పొదిలిలో పొగాకు రైతులను కలిసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లిన సమయంలో టీడీపీ మూకలు రైతులపై రాళ్ల దాడులు చేయించడమే కాకుండా తిరిగి రైతులపై కేసులు పెట్టించిన తీరు దుర్మార్గమని విమర్శించారు. ఏడాది పాలన వెన్నుపోటు అంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతం అయిన తీరును కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన కూటమి నేతలు తాజాగా తల్లికి వందనం ఇస్తామని విద్యుత్ బిల్లుల వంక చూపించి లక్షలాది మందిని అనర్హులుగా చూపించడం దుర్మార్గమన్నారు. కూటమి పాలనను స్వయంగా టీడీపీ ఎమ్మెల్యేలు సైతం విమర్శిస్తుండడం శోచనీయమన్నారు. జగన్ ఐదేళ్ల పాలనను ప్రజలతో పాటు టీడీపీ శ్రేణులు సైతం నేడు ప్రశంసలు కురిపిస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాలను మాజీ మంత్రి కారుమూరితోపాటు పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కమిటీ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, తణుకు ఎంపీపీ రుద్రా ధనరాజు, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, షేక్ ఫహీమా, ఫణీంద్రకుమార్ వీరమల్లు, చింతన్న పాల్గొన్నారు.

పునర్ వ్యవస్థీకరణ ప్రకారమే పనిచేయాలి



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: పాఠశాలలు పునర్ వ్యవస్థీకరణ ప్రకారమే ఈ విద్యా సంవత్సరం నుంచి పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి వి.హనుమ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వి.హనుమ మాట్లాడుతూ పాఠశాలల పరిధిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల సంఖ్య పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తల్లికి వందనం, విద్యార్థిమిత్ర, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం – మన బడి మన భవిష్యత్ పథకం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు అందరూ బడి బయస్సు కలిగిన చిన్నారులకు ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. డ్రాప్ అవుట్స్ లేని మండలంగా తీర్చిదిద్దాలన్నారు. జులై 5వ తేదిన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌ఎంలు మైనం సత్యనారాయణ, ఎస్‌కే లాల్ బీబీ, బ్రహ్మం, కృష్ణారావు, ఎన్. శ్రీనివాసరావు, జి.కనకదుర్గ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలను పరిష్కరించాలి



తణుకులో తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

తణుకు అర్బన్: ప్రపంచ వయోవృద్ధుల వేధింపులు, నివారణ, అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొటికలపూడి చిట్టి వెంకయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, భీమవరం అధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోనం పాండురంగారావులు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం, పోషణ చట్టం 2007ను పటిష్టంగా అమలు చేయాలని, వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, వృద్ధుల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని, మండలానికి ఒక వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అపిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, ఫోరం సహాధ్యక్షుడు ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, నిర్వహణ కార్యదర్శి తాళ్లపూడి గాంధీ, సంయుక్త కార్యదర్శి దిరిశాల సత్యనారాయణ మూర్తి, కోశాధికారి డా.కర్రెడ్డి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పేరిచర్ల లక్ష్మణవర్మ, కడియం ఈశ్వరావు, నిర్వహణ కార్యదర్శి తాళ్లపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సంకు అప్పారావు



సంకు అప్పారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, అప్పారావు కుటుంబసభ్యులు

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ నేతగా సంకు అప్పారావు ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. సంకు అప్పారావు 109వ జయంతి సందర్భంగా సోమవారం బ్యాంక్ కాలనీలోని సమరయోధుల పార్కులో వారి కుటుంబసభ్యులు సంకు మనోరమ, సూర్యకుమారి, విజయకుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం నుంచి యువజన ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, నియంతృత్వ పోకడలను ప్రశ్నిస్తూ జైల్ జీవితాన్ని అనుభవించడమే కాకుండా 10 సంవత్సరాల పాటు రహస్య జీవితాన్ని పాటించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు సంకు అప్పారావు జీవితగాధను కొనియాడారు. సమరయోధుల కుటుంబాలకు చెందిన చల్లా హైమావతి, డాక్టర్ వంక రామదాసు, డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ముళ్ళపూడి రేణుక, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్, కవి, నాటక రచయిత లింగం సత్యనారాయణ, డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మార్పిడి పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా విలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు సోమవారం చెప్పారు. నరసయ్య అగ్రహారం, అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

18న డబుల్ మేజర్‌పై అవగాహన సదస్సు

ఆకివీడు: డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు డబుల్ మేజర్‌పై నూతన విద్యా ప్రణాళికను 2025–26 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం డబుల్ మేజర్‌లోనే ఉంటుందన్నారు. దీనిపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 18న కళాశాల ఆవరణలో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై తమ సందేహాల్ని నివృత్తి చేసుకోవాలని సూచించారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



కంతేరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఇరగవరం: కార్మికులకు ఉపాధి హామీ సంజీవని వంటిదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రం తెలిపారు. సోమవారం ఇరగవరం మండలంలోని కంతేరు గ్రామంలో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి త తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బళ్ళ చినవీరభద్రం మాట్లాడుతూ గత పది వారాల నుంచి పనిచేస్తున్నప్పటికీ కూలీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. మండుటెండలో ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరితో పని చేస్తున్న కూలీలకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే ఏలా బతకాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పని ప్రదేశంలో కూలీలతో యోగ చేయించడం మీద ఉన్నా శ్రద్ధ వేతనాలు చెల్లించడం మీద లేకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని లేకుంటే కూలీలను కూలీలను ఐక్యం చేసి ఉద్యమ పోరాటలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల అప్పారావు, నూతంగి మణి, కాటూరి విజయలత, గుబ్బల రామకృష్ణ, అంపా వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

వెర్టాక్ సేవలు అభినందనీయం



కాళ్ళలో సోలార్ వీధిలైట్లు ప్రారంభిస్తున్న 'వెర్టాక్' ఆర్‌బీఎం సత్యనారాయణ తదితరులు

కాళ్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం 'వెర్టాక్' సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. కాళ్ల గ్రామంలో 'వెర్టాక్' సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ, గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లాలంటే గ్రామస్తులు వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నారని తమ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గాదిరాజు కిరణ్ కుమార్ వర్మ, నారిన శ్రీనివాసరావు, వర్రె శివ తెలపడంతో సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ఒక ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతోపాటు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన సంస్థకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో 'వెర్టాక్' సంస్థ బిజినెస్ ఆఫీసర్ డీఎం రాజు, కిషోర్ నాయుడు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించండి

ఉండి: రైతులకు రబీ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ సోమవారం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ తీరు.. పేరుగొప్ప ఊరు దిబ్బ అనే సామెతలా ఉందని అన్నారు. కబుర్లు చెప్పడంలో కూటమి ప్రభుత్వం ఆరితేరిందని ఎద్దేవా చేశారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లో సొమ్ము నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తామని చెప్పి ఇప్పుడు రైతులను మోసం చేశారన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలోని రైతులకు రూ.295 కోట్లు ధాన్యం సొమ్ము బకాయి పెట్టారని మండిపడ్డారు. రైతుల సొమ్ము ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చారని, గత ఏడాది మొండి చేయి చూపించారని, ఈ ఏడాది ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో రైతు భరోసా సకాలంలో వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారన్నారు. గొప్పలు చెప్పుకోవడం మాని కూటమి ప్రభుత్వ పెద్దలు రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం: భీమవరం ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో తుమ్మలపెంట పద్మనాభం, కారుమూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కారుమూరి భాస్కరరావు, తుమ్మలపెంట రంజిత్‌కుమార్, కోశాధికారిగా గొంట్ల వెంకటరామారావు, ఉపాధ్యక్షునిగా గాదంశెట్టి సతీష్, సహాయ కార్యదర్శిగా గొంట్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధిలోని అండర్‌పాస్ దగ్గర ద్విచక్ర వాహనం జారిపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఒకటో పట్టణం చినరంగనిపాలేనికి చెందిన పి.వెంకటేశ్వరరావు (59) ఈ నెల 5న ద్విచక్రవాహనంపై వెళ్తూ అండర్‌పాస్ వద్ద జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును మెరుగైన చికిత్సకు కాకినాడలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- దుర్గంధంలోనే హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని కమిషనర్



పెదపేటలోని సాంఘికసంక్షేమ శాఖ హాస్టల్ ప్రాంతంలో మురుగునీరు

ఆకివీడు: స్థానిక పెదపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వద్ద డ్రెయినేజీ మురుగునీరు నేరుగా హాస్టల్ ప్రాంగణంలోకి రావడంతో దుర్గంధం భరించలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ స్థానిక ఈ హాస్టల్‌ను, అదే ప్రాంతంలో ఉన్న సచివాలయ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో డ్రెయినేజీ నీరు ఆయా ప్రాంగణాల్ని ముంచెత్తడంతో విద్యార్థులు ఏవిధంగా ఇక్కడ నివసిస్తారని కమిషనర్‌ను కలెక్టర్ నిలదీశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మారడంతో సమస్య పరిష్కారం కాలేదు. దుక్కి వర్షానికి డ్రెయినేజీలోని మురుగు నీరు హాస్టల్ ప్రాంగణం, సచివాలయ ప్రాంగణంను ముంచెత్తుతోంది. మురుగు నీరు హాస్టల్ ప్రాంగణంలో నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా ముక్కులు మూసుకుని పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. స్వచ్ఛ ఆకివీడు కార్యక్రమాలతో పాటు ప్రతి నెలా డ్రైడే నిర్వహిస్తున్నారని, నెలకు ఒకసారి మండల స్థాయి అధికారులు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యల్ని తెలుసుకుంటున్నా కంపు, మురుగు నీరు పోయేందుకు మాత్రం చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ నాగరాణి స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.